# సూర్యచంద్రులు

బస్సుదిగి అటూ, యిటూ చూసాను. ఆటోగానీ, రిక్షాగానీ కనబడలేదు.

ఆరురోజులు వరుసగా రాత్రి డ్యూటీ చేసి అలసిపోయిన కార్మికునిలా, సాయంత్రమయినా ఆదమరచి నిద్రపోతోంది ఊరు. రోడ్డు మీద అలికిడిలేదు. మనుషులూ అసలే లేరు.

రెండు కిలోమీటర్లు వెళితే గానీ, శర్మయిల్లు చేరుకోలేను. ఒక గంట అయినా అక్కడ గడపవలసి వస్తుందో, ఏమో ! మళ్ళీ రాత్రి చివరి బస్సయినా అందుకోలేకపోతే.....

స్కూటర్ మీద రానందుకు నన్ను నేనే తిట్టుకుంటూ గబగబా నడిచాను.

ఆకాశమనే కర్మాగారములో కాల్చిన లోహ గోళములా ఎర్రగా వెలుగుతున్నాడు సూర్యుడు. కాల్చిన లోహగోళాన్ని చల్లపరుచుటకు పశ్చిమార్ణవములోకి తోసే చేతులలో ఉన్న పొడుగుపాటి కాడలలాండి ఎర్రమబ్బు సూర్యునిచుట్టూ వుంది.

దారి గుర్తు చేసుకుంటూ నడిచాను. సుమారు ఆరునెలల క్రితం శర్మ గృహప్రవేశానికి వచ్చాను. అప్పుడు స్నేహితులూ, సహోద్యోగులు కలసి రావటము వల్ల దూరము అస్సలు తెలియలేదు. పైగా అప్పుడు మమ్మల్ని పలకరించటానికి మా శర్మ చిరునవ్వుతో యింటివద్ద ఉంటాడనే నమ్మకము కూడా ఉండేది. కానీ, యిప్పుడు...

మనస్సు బాధతో మూలిగింది. గట్టిగా నిట్టూర్చాను.

శర్మ యింటికి వెళ్ళి భర్త పోయి రోదిస్తున్న అతని శ్రీమతి చేత కొన్ని కాగితాల పైన సంతకాలు తీసుకోవాలి.

శర్మ భార్య గుర్తుకురాగానే నా గుండె తరుక్కుపోయింది. పాపం ! ఎలావుందో ఆమె ! రూపురేఖలు పోల్చుకోలేని విధముగా మాడి మసి అయిపోయిన భర్త కళేబరాన్ని చుట్టుకొని ఏడ్చి, ఏడ్చి స్పృహ కోల్పోయిన ఆమె, గుర్తుకు రాగానే కళ్ళు నిండాయి. అంకితభావము, జీవితములో ఏదైనా సాధించాలనే అతని తపన నన్ను అతిని వైపు

ఖర్చీఫ్‌తీసి కళ్లు ఒత్తుకుని శర్మ యింటికి చేరే మలుపు తిరిగెను. అనుకోని మలుపులు తిరగటమే కదా జీవిత శకటము యొక్క ప్రత్యేకత!

నేను కర్మాగారములో చేరినప్పుడు శర్మ మా సెక్షన్‌లో పనిచేసేవాడు కాదు. వందల కొద్దీ కార్మికులున్న కర్మాగారములో అందరినీ తెలిసికోవటము కష్టము. చేరి ఆరునెలలు పోయాక శర్మతో పరిచయము చేసుకొనే అవకాసము కలిగింది నాకు.

కార్తీకమాసము తనతో తెచ్చుకున్న చల్లటిగాలి, కార్మికులలో పిక్నిక్ గాలిని రేపింది. కుర్రవాడనీ, ఉత్సాహవంతుడనీ, పిక్‌నిక్‌కి అవసరమైన పనులు చెయ్యమని నాకు అప్పగించారు. డ్యూటీలో లేనివారు అందరూ పిక్నిక్‌కి అంగీకరించారు ఒక్క శర్మ తప్ప.

"వాడిని వదిలేయరా" మా, సహోద్యోగి అన్నాడు. "వాడు రాడు"

"ఎందుకని"

"ఎందుకంటే ఏమి చెప్పను, వాడు వుత్త 'వర్క్‌హోలిక్' రా, ఏ సరదా లేదు, ఓటీ యివ్వకపోయినా రెండు గంటలు అదనముగా పనిచేస్తాడేమో గానీ, ఇలాంటివి శర్మకు గిట్టవురా"

"వాడు వుత్తపిసినారిరా, వాడెందుకు వస్తాడు" మరో సహోద్యోగి అన్నాడు.

"అలా అంటే ఎలాగండీ, నేను వదలను. ఎందుకు రారో తేల్చుకుంటాను"

మరునాడు కేంటినులో కనబడ్డాడు శర్మ. నేను అతను కూర్చున్న చోటుకి వెళ్ళాను. నన్ను పరిచయం చేసుకున్నాను.

"పిక్నిక్ లిస్టులో మీ పేరు కనబడలేదే"

"పేరు యివ్వనిదే ఎలా కనబడుతుందండి" ఎదురు ప్రశ్న వేసాడు అతను.

"నిజమేనండీ, కానీ ఎందుకు పేరు యివ్వలేదు, అని"

అతను నా మాటలు పట్టించుకోలేదు. ఇంటినుంచి తెచ్చుకున్న కేరియర్ మూత తీసాడు.

"చూడండీ శర్మగారూ" నేను అన్నాను. "సంవత్సరాలుగా కర్మాగారాలలో

తిరిగే యంత్రాలతో పాటు రాత్రిపగలు డ్యూటీచేసే మనము కూడా యంత్రాలుగా మారిపోతున్నాము కదండీ. అందుకే మధ్యన కాస్త ఆటవిడుపులాంటిది, ఈ పిక్నిక్. కొంత సరదా....."

"సరదాలకేముందిలెండి. పిక్నిక్ వెళ్ళటము మీ సరదా అయితే నా బాధ్యతలని నిర్వర్తించటము నా సరదా" తన కేరియర్లో నుంచి అన్నము తింటూ అన్నాడు, అతను. " అయినా రెండు వందలు ఏమయినా తక్కువ డబ్బా - మా అమ్మాయికి ఓ నెల ఫీజు"

"అందరికీ అంతే కదండీ"

"మిగతా వాళ్ళసంగతి నాకు తెలియదు. అనవసరము కూడా"

శర్మ పిసినారి అని కొందరు అనే మాటలు నిజమేమో అని అనిపించింది నాకు. అయినా విడిచిపెట్టలేదు.

"రెండు వందలు ఎక్కువే కావచ్చు కానీ ఎప్పుడో ఒకప్పుడు మీ సంతోషం గురించి, సరదాల గురించి ఖర్చు పెట్టుకోరండీ?"

"నాకు ఈలాంటి సరదాలు, సంతోషాలు వద్దు" శర్మ కోపంగా అన్నాడు.

"మీరు అనవసరముగా మాటలు పెంచవద్దు. మా యింటి వాళ్ళ సరదా తీర్చటమే నా సరదా. వాళ్ళు సంతోషంగా వుంటే అదే నా సంతోషము"

మరో మూడు నెలలకు నన్ను శర్మ సెక్షనుకు బదిలీ చేసారు. అతనితో కలిసి పనిచేయటము వల్ల అతనిపై నాకు ఆరాధనా భావము ఏర్పడింది.

నిర్విరామముగా పనిచేసే రసాయన కర్మాగారాలలో, ఏ సమస్య లేనప్పుడు మాలాంటి ఆపరేట్లకు ఎక్కువ పని ఉండదు. యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా అని గమనించటమే, మా పనిగనుక కొంత ఖాళీ వుంటుంది. అప్పుడు పిచ్చాపాటి మాట్లాడుకోవటము పరిపాటి. అలా మాట్లాడుకోవటము వల్లే శర్మ గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను. అతని ఆర్థిక పరిస్థితి గురించి, కుటుంబం గురించీ, కుటుంబ బాధ్యతల గురించి తను బాధపడినా, ఇబ్బందిపడినా, తన కుటుంబ సభ్యులు ఇబ్బంది పడకూడదనే అతని తపన గురించి తెలుసుకున్నాను. పనిలో అతని

ఆకర్షించాయి.

"ఇళ్లు కట్టాలని అనుకుంటున్నానురా" ఓ రోజు శర్మ అన్నాడు. అదుపు తప్పుతున్న ఆవిరి వత్తిడిని అదుపులోకి తేవడానికి ప్రయత్నిస్తున్న నేను ఏమీ అనలేదు.

"ఇక్కడ అద్దెలు, ఇచ్చుకోలేనురా" మళ్ళీ అన్నాడు శర్మ "అందుకే ఒక సైటు చూసాను"

"ఎక్కడ?"

సైటు ఎక్కడ వుందో చెప్పాడు అతను. మా కర్మాగారమునుంచి పదిహేను కిలోమీటర్లు అవతల వుంది ఆ సైటు.

"అక్కడ నుంచి డ్యూటీకి రావటము కష్టము కదా?"

"కష్టమే. కానీ, నా వద్ద వున్న డబ్బుకి, అక్కడే దొరుకుతుంది"

"మరొకొంత డబ్బు కూడబెట్టుకొని ఓ రెండేళ్ళు ఆగికొనవచ్చు కదా?" నేను అడిగాను. "అయినా ఇప్పుడేమిటి, అంత తొందర ఇళ్ళు కట్టడానికి"

"అద్దెలు భరించలేకపోతున్నాని చెప్పాను కదా. పైగా రసాయన కర్మాగారాలలో పనిచేసే వాళ్ళము మన జీవితాలకు గ్యారంటీ ఏమిటి?" "ఏదైనా అయిపోతే......." శర్మ ఓ నిముషము ఆగి అన్నాడు. "తల దాచుకోటానికి ఓ కొంప అంటూ వుంటే పెళ్ళాం, పిల్లలకి ఓ ఆధారం వుంటుంది కదా అని"

అతని ఆలోచన నాకర్థమయింది. తోలు బొమ్మలాటలోని బొమ్మల కాళ్ళకు కట్టిన తాళ్ళ కేంద్ర బిందువు ఆడించేవాడి చేతిలో వున్నట్లే, శర్మని ఆడించే తాళ్ల కేంద్రబిందువు తన కుటుంబ సంక్షేమము గురించిన ఆలోచనయేనని నాకు తెలుసు.

ఇల్లు మొదలుపెట్టాడు శర్మ, అయినా డ్యూటీ మానలేదు. ఎప్పటిలాగే, ఓ.టి. డ్యూటీ చేసుకునే వాడు.

చాలా నీరసించిపోయాడు అతను. పని ఒత్తిడి అతని ఒంటిమీద కొట్టొచ్చినట్లు కనబడింది. కళ్ళు లోతుకు పోయాయి. కంటిచుట్టూ నల్లనిచారలు చేరాయి. శరీరము

సన్నబడింది.

"చాలా పాడైపోయారండీ" ఒక రోజు శర్మతో అన్నాను నేను.

"తెలుసు అయినా ఇంకా ఎన్నాళ్ళు, మరో రెండు నెలల్లో ఇల్లు పూర్తి చేసి గృహప్రవేశము చేస్తే అంతా విశ్రాంతియే కదా?"

టీ తీసుకొని వచ్చాడు కుర్రవాడు. టీ తీసుకొని శర్మకు అందించాను.

"ఒద్దురా" శర్మ అన్నాడు. "టీ తాగటము మానేసాను"

"మానేసారా! షిప్టుకి అయిదు, ఆరు కప్పులు త్రాగేవారు"

"అది ఒకప్పుడు, అయిదారు కప్పుల టీ డబ్బులు ఓనెల అదాచేస్తే ఒక సిమ్మెంటు బస్తా వస్తుంది"

రోడ్డు ఒకయింటిముందువరకూ వచ్చి ఆగింది. అక్కడ నుంచీ పక్కకు తిరిగి రెండడుగులు వేస్తే శర్మ ఇల్లే.

ఓ సిగరెట్టు వెలిగించాను.

ఆకాశమనే కర్మాగారములో తారాదీపతోరణాలు వెలిగేయి. ఇలాంటి సమయములోనే జరిగింది, ఆ ప్రమాదము, చీకటి చిక్కబడుతోంది. రాబోయే తుఫానుకు హెచ్చరికగా గట్టిగా వీస్తోంది గాలి.

పనిచెయ్యని ఓ పంపుని పరిశీలిస్తున్నాము నేను, శర్మ

"ఇల్లు కట్టుకున్నారు ఓ సమస్య తీరిపోయింది ఇకనైనా....."

"ఓ సమస్య తీరిపోతే మరో నాలుగు సమస్యలు లేస్తాయి. ఇంటికి వచ్చిన వాళ్ళని కూర్చోపెట్టడానికి ఓ ప్లాస్టిక్ కుర్చీ కూడా లేదు. సోఫాసెట్టు, కలర్ టీ.వి. కావాలని అంటోంది మా ఆవిడ, మా అమ్మాయి అయితే ఒక సైకిలు........"

హఠాత్తుగా ఏదో పేలుడు వినబడింది. వెయ్యి సూర్యులూ, ఒకేసారి, ఉదయించినంత వెలుగు, వేడి వాతావరణములో వ్యాపించింది.

పరుగెత్తాడు శర్మ. పేలుడు జరిగింది విధి నిర్వహణలో, అతని పరిధిలో ఉన్న టేంకులోనే !

అగ్నిమాపకదళం వారు వచ్చారు. వాళ్లతో పాటు శర్మ ఇతర ఆపరేటర్లు అగ్నిని అదుపులే పెట్టడానికి ప్రయత్నించారు. మంటతో పాటు వచ్చిన పొగ మనుష్యులనీ, కర్మాగారాన్ని కప్పేసింది. ఆ పొగలో మునిగిపోయిన మాకు వాచీ చూస్తేగాని తెల్లవారినట్లు తెలియలేదు.

చివరకు మంట ఆగింది. బుసలు కొట్టిన నాగుపాము, తన విషమంతా కక్కిన తరువాత పడగ ముడుచుకుంటున్నట్లు, మెల్లమెల్లగా, ఆరింది మంట.

అయినా మాస్టరు చేతిలోని బెత్తము దెబ్బలకు గురయిన పిల్లవాడు ఏడుపు ఆపినా, అప్పుడప్పుడు నిట్టూరుస్తున్నట్లు అగ్ని స్ఫులింగాలు రేగాయి.

నల్లగా మాడి, మసి అయిపోయిన శర్మని, మరో ఇద్దరినీ మోసుకొని హాస్పటల్ చేరిందీ ఆంబులెన్స్. ఆ వెనుక వచ్చింది శర్మ శ్రీమతిని తీసుకువచ్చిన కారు. రాబోయే సీను ఊహించుకోగలిగిన నేను, అక్కడ నిలబడలేకపోయాను.

తారలనే ముత్యాలతో ఎంబ్రయిడరీ చేసిన ఎర్ర మబ్బుల పట్టు వస్త్రముతో కప్పబడిన లోకబాంధవుడైన తన భర్త శవముపై పడి మూర్ఛపోయింది సంధ్య.

"అంకుల్ మీరా!" నా వెనుక వచ్చిన శర్మ కూతురు నన్ను పోల్చింది. "మమ్మీ అంకుల్ వచ్చారు" తుర్రుమని సైకిలు మీద వెళ్ళిపోయిఅంది, పాప.

ఇంటి ముందు దీపము వెలిగింది. "రండి అన్నయ్యగారూ" సాదరముగా ఆహ్వానించింది, శర్మ శ్రీమతి.

సోఫా మీద కూర్చున్నాను. గది బాగా అలంకరించి వుంది. అందమైన సోఫాసెట్టు, కలర్ టీ.వి. గదిలో ఉన్నాయి.

"మంచినీళ్ళు తీసుకోండి"

చల్లటి నీరు అందుకొని, ఆమెను గమనించాను. రెండు నెలల క్రితము, భర్త పోయిన స్త్రీలా కనబడలేదు ఆమె. అందముగా అలంకరించుకున్న ఆమె నుదిటిమీద తిలకము కూడా దిద్దుకుంది.

"మనవాళ్ళందరూ ఎలా వున్నారండీ!" ఆమె అడిగింది.

"బాగానే ఉన్నారు" నేను ముభావముగా అన్నాను. "పెన్షన్ కాగితాలపై సంతకములు కావాలట అందుకోసము వచ్చాను" కాగితాల్ని ఆమెకు ఇచ్చాను.

"చాలా సంతోషము" కాగితాలపై సంతకాలు చేస్తూ అంది ఆమె " కిందటి వారము, పి.ఎఫ్. డబ్బులు, ఎల్.ఐ.సి. డబ్బులు వచ్చాయండి" ప్రమాదుమలో చనిపోయారు కనుక రావాల్సిన డబ్బుకూడా మొన్ననే వచ్చింది"

నాకు చాలా ఆనందము కలిగింది. వచ్చిన డబ్బుతో వాళ్ళు హాయిగా బ్రతకవచ్చు. శర్మ ఆశించినది కూడా అదే కదా!

"మీరు నాకు ఓ సహాయము చెయ్యాలండీ" ఆమె అంది. "డబ్బు ఎంతఅయినా పరవాలేదు. టౌనులో ఓ మంచి అపార్టుమెంటు చూడండి"

"ఎవరికండీ?"

"మాకే, మేము టౌనుకి మారిపోతామండీ. ఈ పల్లెటూరిలో నాకు కాలక్షేపమే ముంటుంది?"

"మరి, ఈ ఇల్లు?"

"అమ్మేస్తామండీ, అయినా టౌనులో ఇళ్ళతో పోలిస్తే, ఇదో ఇల్లా"

నాకు బుర్ర తిరిగిపోయింది. తన భార్యాబిడ్డలు నిలవ నీడలేకుండా ఇబ్బంది పడకూడదని రూపాయి, రూపాయి కూడ బెట్టి ఇల్లుకట్టాడు శర్మ.

తన కుటుంబ సభ్యుల బ్రతుకులకు సరదాని పంచటానికి తన సరదాలని అవసరాలని, బ్రతుకుని త్యాగము చేసిన శర్మ పిచ్చివాడని అనిపించింది నాకు.

బయటికి వచ్చాను

సూర్యుడు అందించిన వెలుగుని పూర్తిగా సొంతము చేసుకొని, ఆకాశవీధిలో హాయిగా, నవ్వుతూ తిరుగుతున్నాడు సొంత వెలుగులేని చంద్రుడు

(ఆంధ్రప్రభ వారపత్రిక 16-2-2002)